సాక్షి నిజామాబాద్

సోమవారం । 25 । నవంబర్ । 2024



‘స్పెల్ బీ’కి విశేష స్పందన

నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ కి విశేష స్పందన వచ్చింది.

- 8లో ▸



కొలువుల్లోకి కొత్త కానిస్టేబుళ్లు

కొత్త కానిస్టేబుళ్లు ఈ నెల 30న ఉద్యోగాల్లో చేరనున్నారు. జిల్లాకు చెందిన 217 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.1 /15.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 1,861 మంది విద్యార్థులకుగాను 1785 మంది హాజరయ్యారు. 76 మంది గైర్హాజరయ్యారు.

తనిఖీలకు వస్తున్నాం.. అలర్ట్ చేయండి!

- వాట్సాప్‌లో ఎక్సైజ్ సీఐ మెసేజ్

బోధన్ టౌన్ : తనిఖీలకు వస్తున్నాం.. సంబంధిత బెల్ట్ దుకాణాలు, కల్లు దుకాణాలను అలర్ట్ చేయాలని ఓ ఎక్సైజ్ సీఐ వాట్సాప్‌లో పంపిన మెసేజ్ చర్చనీయాంశం అయింది. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తనిఖీలకు వస్తున్నామని సర్కిల్ పరిధిలో అక్రమంగా నడుస్తున్న బెల్టు దుకాణాలు, కల్లు దుకాణాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ పవన్ కుమార్‌గౌడ్ వాట్సాప్‌లో మెసేజ్ చేశారు. ప్రజాప్రతినిధి పర్యటించే రోజు దుకాణాలు బంద్ చేసుకోవాలని నిర్వాహకులను అలర్ట్ చేసే తరుణంలో తమ శాఖ కానిస్టేబుల్స్ వాట్సాప్ గ్రూపులో పెట్టాల్సిన మెసేజ్‌ను సీఐ ఏకంగా వేరే గ్రూపులో పెట్టారు. దీంతో ఆ విషయం వైరల్ అయింది.

నిత్యం దైవ నామస్మరణ చేయాలి

- ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు



బాన్సువాడ : నిత్యం దైవ నామ స్మరణ చేయాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, అవధాని, ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు సూచించారు. ఆదివారం బాన్సువాడ అయ్యప్ప అన్నదాన ట్రస్ట్, అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గరికిపాటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అమ్మను పూజించాలన్నారు. తల్లిదండ్రుల పేర్లతో దానధర్మాలు చేయాలని సూచించారు. కార్తీక మాసానికి ప్రత్యేకత ఉందన్నారు. ఏటా ఈ నెలలోనే అయ్యప్ప దీక్షలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు తెలుగు నెలల పేర్లనే వాడాలని సూచించారు. సనాతన ధర్మం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. పూజలు, దీక్షలు, అభిషేకాలను తాను వ్యతిరేకించనని, అలా చేస్తే హిందూ ధర్మాన్నే వ్యతిరేకించినట్లు అని పేర్కొన్నారు. హిందూ మతంలో ఉన్న విభేదాలను పోగొట్టే గొప్ప దీక్ష అయ్యప్ప మాలధారణ అన్నారు. మనలో ఉండే లోపాలను మనమే గుర్తించి, వాటిని అధిగమించడానికి కృషి చేయాలని సూచించారు. కుటుంబంలో సమస్యలు ఉంటే కుటుంబ సభ్యులతోనే చర్చించాలన్నారు. బయట వ్యక్తుల వద్ద ఆ ప్రస్తావన తీసుకురావద్దని సూచించారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కామారెడ్డి జిల్లావాసి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన చకినాల అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదారాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష స్థానం కోసం ఇద్దరు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో అనిల్ కుమార్ విజయం సాధించారు. అనిల్‌కుమార్ ప్రస్తుతం టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ఇసుక పంచాయితీలో సీఐ బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి : ఇసుక అక్రమ రవాణాకు సహకరించిన సీఐని అధికారులు బదిలీ చేశారు. ఇసుక దందాకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీ కార్యాలయం నుంచి సెప్టెంబర్ 9న సీపీ ఆఫీస్‌కు జాబితా పంపించారు. అప్పటి సీపీ వారిపై చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై అక్టోబర్ 24న సాక్షి పత్రికలో ‘ఇసుక దందాకు ఖాకీల అండ’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఆ జాబితాలో బోధన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన వీరయ్య పేరు ఉంది. సీపీ కల్మేశ్వర్ ఉన్నప్పుడు వీరయ్యను ట్రాఫిక్ సీఐగా బదిలీ చేయగా నాలుగు నెలలకే మళ్లీ పీసీఆర్‌కు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వచ్చాయి. ఇసుక దందాకు సహకరించిన ఎస్సైలను కూడా బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

పక్షుల ప్రపంచం







రంగు రంగుల పక్షులు కనువిందు చేస్తున్నాయి. ఒకే చోట దేశ, విదేశాలకు చెందిన విహంగాలు ఆకట్టుకున్నాయి. వాటి కిలకిలారావాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాలపల్లిలో సయ్యద్‌బిన్ ఖలీద్ వివిధ ప్రాంతాల నుంచి పక్షులను తీసుకొచ్చి నగరవాసులకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర, గోవాతో పాటు ఆఫ్రికన్ దేశాల నుంచి పక్షులను సేకరించారు. పక్షుల జాతుల్లో ఆఫ్రికన్ లివ్, కాక్‌టేయిల్, ఫెంచిస్, జవా, దోవ్, పీజియన్, చిక్స్ అందుబాటులో ఉన్నాయి. ఇవి రూ.500 నుంచి రూ. 20 వేల వరకు ధర పలుకుతున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

యాసంగికి భరోసా

- నిండుకుండలా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్
- పంటల సాగుకు ఢోకా లేదంటున్న ఆయకట్టు రైతులు
- ఖరారు కాని నీటి విడుదల షెడ్యూల్



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ : ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది. దీంతో యాసంగి పంటలకు ఢోకా లేదని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో సమృద్ధిగా వానలు పడటంతో ప్రాజెక్ట్‌కు భారీగా వరదలు వచ్చాయి. ప్రస్తుతం యాసంగి సీజన్ మొదలు కాబోతుంది. ఇప్పుడు కూడా ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతోంది. ప్రాజెక్ట్ నుంచి ప్రతి సంవత్సరం డిసెంబర్ రెండో వారం నుంచి యాసంగికి నీటి విడుదలను ప్రారంభిస్తున్నారు. ముందస్తుగా నీటి విడుదల చేపడితే వేసవిలో ముందుగా పంటలు చేతికందుతాయి. దీంతో వేసవిలో చివరలో పంటలకు నీటి కొరత ఉండదని పాలకులు గతంలో అలా నిర్ణయించారు. ప్రస్తుతం నీటి విడుదల ప్రణాళికపై ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రాజెక్ట్ అధికారులు నీటి లభ్యత, నీటి నిల్వ వివరాలను ఉన్నత అధికారులకు అందజేశారు. దాని లెక్క ప్రకారం ఉన్నత అధికారులు నీటి విడుదలను నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వతో ఖరీఫ్‌లో అందించిన పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టవచ్చని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కమిటీ సమావేశం అనంతరం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు నీటి విడుదల షెడ్యూల్ ఇప్పటి వరకు ఖరారు కాలేదు. ప్రాజెక్ట్ నుంచి ఖరీఫ్ పంటలకు నీటి విడుదలను ఈ నెల 5న నిలిపి వేశారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ లెక్కలను ఉన్నత అధికారులకు ప్రాజెక్ట్ అధికారులు ఆయకట్టు నీటి విడుదల కమిటీకి, ప్ర భుత్వానికి పంపారు. కమిటీ సమావేశం అనంత రం నీటి విడుదల లెక్కలతో ప్రణాళిక సిద్ధమవుతుంది.

అక్టోబర్ వరకు వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ 80.5 టీఎంసీలతో నిండుకుండలా ఉంది. ప్రాజెక్ట్‌లోకి ఈ సంవత్సరం భారీ వరదలు వచ్చాయి. వందల టీఎంసీల నీరు గోదావరి పాలు అయింది. అక్టోబర్ వరకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో రావడంతో ఇప్పటికీ జలాశయం నిండుకుండలా ఉంది. బాబ్లీ గేట్లు మూసివేయడంతో వరద నీరు నిలిచిపోయింది.

వానాకాలంలో నీరందించిన ఆయకట్టు వివరాలు (ఎకరాల్లో..)

కాకతీయ కాలువ	4,60,000
లక్ష్మి కాలువ	50,000
సరస్వతి కాలువ	50,000
అలీసాగర్ ఎత్తిపోతలు	57,793
గుత్ప ఎత్తిపోతలు	38,967
చౌటుపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలు	11,600
నిజామాబాద్ జిల్లాలోని ఇతర 14 ఎత్తిపోతలు	34,948
నిర్మల్ జిల్లాలో 9 ఎత్తిపోతలు	30,417

రండి.. చేరండి..

- మహిళలను సంఘాల్లో చేరాలని ఆహ్వానిస్తున్న సమాఖ్యల ప్రతినిధులు
- జిల్లాలో 16 వేల మంది మహిళలకు కొత్తగా సభ్యత్వం కల్పించాలని లక్ష్యం
- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

మోర్తాడ్(బాల్కొండ) : రండి... చేరండి... మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల లబ్ధి చేకూరుస్తుంది.. స్వయం ఉపాధి కోసం వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారు.. ఆర్థిక చేయూతను అందించడానికి మహిళల కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది.. అంటూ ఇంటింటి ప్రచారానికి గ్రామ సమాఖ్యల ప్రతి నిధులు శ్రీకారం చుట్టారు. 18 ఏళ్ల వయస్సు నిండి శాశ్వత నివాసం ఉన్న మహిళలకు సంఘాల్లో సభ్యత్వం కల్పించడానికి ఆహ్వానం పలుకుతున్నారు. వారం రోజుల నుంచి మహిళా సంఘాల సభ్యత్వం పెంచడానికి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 800 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. ఒక్కో సమాఖ్యలో 10 మంది నుంచి 20 మందికి కొత్తగా సభ్యత్వం కల్పించాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 16 వేల మందికి సభ్యత్వం కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. 60 ఏళ్లు పైబడిన మహిళలు సంఘాల నుంచి తప్పుకుంటుండటంతో కొత్త సభ్యత్వ నమోదు తప్పనిసరైందని పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు చెబుతున్నారు. కొత్త సభ్యులు చేరడం, వయస్సు మీరిన మహిళలను సంఘాల నుంచి తొలగించడం ప్రతి ఏటా కొనసాగుతుంది. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి సంబరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే మహిళా సంఘాల్లో సభ్యత్వ నమోదుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 25 వేల మహిళా సంఘాల్లో 2.60 లక్షల మంది సభ్యులు ఉన్నారు. సభ్యుల సంఖ్యను పెంచడం వల్ల రుణాల పంపిణీ లక్ష్యం పెంచడానికి అవకాశ ఉందని అధికారులు చెబుతున్నారు.



మహిళా సంఘంలో చేరాలని బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న సమాఖ్య ప్రతినిధులు(ఫైల్)

ఒక్కో సభ్యురాలికి రూ.5 లక్షల రుణం..

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం ఉపాధి కోసం ప్రత్యేక రుణాల పంపిణీ లక్ష్యం నిర్ణయించారు. ఒక్కో సభ్యురాలికి రూ.5 లక్షల రుణం అందించాలని ప్రభుత్వం వెల్లడించింది. మహిళలు వ్యాపారం చేసుకోవడానికి ప్రత్యేక రుణాలు ఇవ్వడంతో పాటు ఇతర స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న సభ్యులు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని రీయింబర్స్‌మెంట్ రూపంలో వెంటది వెంటనే మహిళా సంఘాలకు ప్రభుత్వం వాపసు చేస్తుంది. ఇలా ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ కొత్త సభ్యత్వం నమోదుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు.

సంప్రదాయబద్ధంగా ఆహ్వానిస్తున్నాం...

కొత్త సభ్యులను ఆహ్వానించే విషయంలో సంప్రదాయ పద్ధతులను పాటిస్తున్నాం. ఇంటింటికి వెళ్లి సంఘాల్లో సభ్యులుగా లేనివారిని బొట్టు పెట్టి సభ్యత్వం తీసుకోవాలని ఆహ్వానిస్తున్నాం. మహిళల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సభ్యత్వ నమోదు లక్ష్యానికి అనుగుణంగా సాగుతోంది.

– గంగారెడ్డి, ఏపీఎం, కమ్మర్‌పల్లి

వచ్చే నెలలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన

నిజామాబాద్ అర్బన్ : జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన డిసెంబర్ 5, 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో ఈ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ కూడా ఒకేసారి నిర్వహించనున్నట్లు తెలిపా రు. ఈ నెల 30లోగా బాల వైజ్ఞానిక ప్రదర్శ న గూగుల్‌ఫామ్ అందించాలని సూచించా రు. సుస్థిర భవిష్యత్, ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు అనే అంశంలో సెమినార్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అదే విధంగా ఉపాధ్యాయులు టీఎల్‌ఎం మేళా ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. డీఈడీ, బీఎడ్ విద్యార్థులు కూడా వారి ప్రదర్శనలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 98482 19365 నంబర్‌లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

పెరిగిన చలి తీవ్రత

నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలో చలితీవ్రత పెరిగింది. వారం రోజులుగా ప్రతి రోజు చలి పంజా విసురుతోంది. దీంతో జిల్లా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకే చలి ప్రారంభం అవుతోంది. ఉదయం 9 గంటల వరకు చలి ఎక్కువగా ఉంటుంది. చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులు ఉన్నవారు మరింత ఇబ్బంది పడుతున్నారు. చలి గాలులతో చిన్న పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. మధ్యాహ్నం వేళ కూడా చలిగా ఉండడంతో బయటకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. చలి నుంచి రక్షించుకోవడానికి ప్రజలు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు.



జిల్లాలో వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్ట	కనిష్ట	తేదీ	గరిష్ట	కనిష్ట	తేదీ	గరిష్ట	కనిష్ట
17	34.2	17.3	19	32.1	15.8	22	31.5	15.8
18	33.2	15.9	20	32.3	15.6	23	31.4	15.5
			21	32.1	15.8	24	31.1	15.4

వైభవంగా కాలభైరవుడి రథోత్సవం

- తరలివచ్చిన భక్తులు
- ముగిసిన స్వామివారి జన్మదినోత్సవాలు

రామారెడ్డి: ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీకాలభైరవస్వామి జన్మదిన వేడుకలలో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. స్వామివారి ఉత్సవ మూర్తులతో బయలుదేరిన రథం.. ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాల మీదుగా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. కాలభైరవ నామ స్మరణతో వీధులు ప్రతిధ్వనించాయి. మహిళలు మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. రథోత్సవం అనంతరం దక్షయజ్ఞం నిర్వహించారు. వీరశైవ మహేశ్వరులు దండకాలు వేశారు. అనంతరం ఆలయం వద్ద జాతర సాగింది. జాతరతో స్వామివారి జన్మదినోత్సవాలు ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కాలభైరవ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉపాధిలో పూడికతీతకు స్వస్తి

- ఉపాధి హామీ నుంచి తొలగించిన కేంద్రం
- కొత్తగా 21 పనులకే పథకం పరిమితం
- గ్రామాల్లో పనులు గుర్తిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. గ్రామాల్లో పేదలకు దండిగా ఉపాధి లభించే చెరువుల్లో పూడిక తీత పనులకు స్వస్తి పలికింది. ఇక మీదట చెరువులు, కెనాల్స్‌లో ఎలాంటి పనులు చేపట్టవద్దని గ్రామీణాభివృద్ధి శాఖకు సూచించింది. దీంతో కూలీలు ఉపాధికి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఆరు కేటగిరీల్లో కొత్తగా 21 రకాల పనులతో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ పనుల్లో కూలీలకు పని చేసేందుకు ఎంత వరకు అవకాశం లభిస్తుందో తెలియదు. ఇటు ఈ నెలాఖరు నాటికి పనులు గుర్తించి వాటి అంచనాలను సిద్ధం చేసి పంపించాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయి. గ్రామ స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించే పనిలో నిమగ్నం అయ్యారు. గుర్తించిన పనులను 2025 మార్చిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు కూడా విధించింది.

మహిళా శక్తికి భరోసా

మహిళా సంఘాల సభ్యులందరికీ ఉపాధి భరోసా కల్పించేలా ఉపాధిహామీలో భాగస్వాములను చేసింది ప్రభుత్వం. వీరిని స్వయం ఉపాధి వైపు మళ్లించేలా రుణాలిచ్చి ఆవులు, మేకలు, చేపల పెంపకం చేపట్టేలా చేస్తారు. పశువుల షెడ్లు, వర్మి కంపోస్టు, అజోల మొక్కల పెంపకం, బీడు భూముల అభివృద్ధి చేయనున్నారు. పశువుల షెడ్లు, వర్మి కంపోస్టు షెడ్లు మండలానికి పది చొప్పున, అలాగే పౌల్ట్రీ షెడ్లు మండలానికి ఒకటి చొప్పున నిర్మించనున్నారు.

పొలం బాటలు

పల్లెల్లో పంట ఉత్పత్తులు ఇంటికి చేర్చడానికి మట్టిదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో 20 కిలో మీటర్లు మట్టిరోడ్లు వేసుకోవచ్చు. గతంలో ఎక్కువ సంఖ్యలో ఉండే మట్టి రోడ్ల సంఖ్యను కేంద్ర తగ్గించింది.

మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం

గ్రామాల్లో ఇంటింటి వ్యక్తిగత ఇంకుడుగుంతల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. కనీసం మండలానికి పది చొప్పున నిర్మించాలని లక్ష్యాన్ని పెట్టుకున్నారు. అలాగే పాఠశాలల్లో మండలానికి ఒకచోట టాయిలెట్ల నిర్మాణం, మండలానికి కిలోమీటరు చొప్పున సీసీ రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది సీసీ రోడ్ల నిర్మాణాలను కేంద్రం తగ్గించింది. అలాగే అంగన్‌వాడీ భవనాలు మండలానికి ఒకటి చొప్పున, గ్రామ పంచాయతీ భవనాలను మండలానికి రెండు చొప్పున నిర్మించనున్నారు.

జలనిధి

జలసంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, ఇంటింటా ఇంకుడు గుంతలు, ఫారం పాండ్లు, ఇంటి పైకప్పు భాగంలో కురిసిన నీటిని భూగర్భంలోకి ఇంకించేలా (రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్), చేతి పంపులా వద్ద ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వడం, చెక్‌డ్యాంలు కట్టేలా చర్యలు తీసుకోనున్నారు. చెక్ డ్యాంలు మండలానికి ఒకటి, ఫారం పాండ్లు మండలానికి ఐదు చొప్పున నిర్మించనున్నారు.

పండ్ల తోటలు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల ద్వారా రైతులను ప్రోత్సహించడం, వారికి రాయితీపై బిందు సేద్యం పరికరాలు ఇచ్చేలా చేస్తారు. జిల్లాలో 8 లక్షల ఈత, తాటి వనాలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పండ్ల తోటలను మండలానికి ఐదెకరాల్లో పెంచేలా లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇందుకు అవసరమైన నర్సరీలను సిద్ధం చేయనున్నారు.

గడువులోగా పనులు పూర్తి చేస్తాం



ఉపాధి హామీలో ఇచ్చిన పనులు ఈ నెలాఖరు నాటికి గుర్తించి పంపించాలని క్షేత్ర స్థాయి ఉద్యోగులకు ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం విధించిన గడువులోగా పనులను పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందిస్తాం. కూలీలకు ఉపాధి లభించేలా పనులు కల్పిస్తాం.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు..

27	530	2,56,777	4,86,073
మండలాలు	గ్రామపంచాయతీలు	జాబ్ కార్డులు	కూలీలు

క్లుప్తంగా

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు ప్రోత్సాహం



మోపాల్: రాష్ట్రంలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోషియేషన్ ప్రోత్సహిస్తోందని నిజామాబాద్ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వాసు అన్నారు. మోపాల్‌లో ఉన్న నిజామాబాద్ ఫిట్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో మెన్స్ డబుల్స్ ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2024 క్రీడా పోటీలకు ఆయన హాజరై పోటీలను ప్రారంభించారు. మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతితో పాటు మెరిట్, ప్రశంసా పత్రాలు, అవార్డులను అందజేస్తున్నట్లు నిర్వాహకులు శౌరబ్, అరవింద్, విజయ్, షోహాయిల్, శాదుల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్యులు జి హరికృష్ణ, కెప్టెన్ క్లబ్ నిర్వాహకులు కిరణ్, నవీన్, ఏటీఎస్ శ్రీనివాస్, అంగిరేకుల సాయిలు, మల్లన్న, శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ టోర్నీకి అబ్జర్వర్‌గా ప్రసాద్



నిజామాబాద్‌నాగారం: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అండర్–19 బాలికల టోర్నీకి అబ్జర్వర్‌గా కె ప్రసాద్ వ్యవహరించనున్నారు. ఈయన ముప్కాల్ ప్రభుత్వ పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.పాఠశాల హెచ్‌ఎం గంగారాం, ఎంఈవో జక్కుల రవికుమార్, ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి జావీద్, నాగరాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి ఆయనకు అభినందనలు తెలిపారు.

వినరా భారతీయ వీర చరిత పుస్తకావిష్కరణ



నిజామాబాద్ రూరల్: జిల్లాకు చెందిన రచయిత రాంనరేశ్ రాసిన వినరా భారతీయ వీర చరిత పుస్తకాన్ని హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరిగిన లోక్ మంథన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మన చరిత్రను భావితరాలకు అందించాలన్నారు. ఈ పుస్తకాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని పేర్కొన్నారు. 108 మంది వీరుల చరిత్రను పుస్తకంగా తేవడం అభినందనీయం అన్నారు. జాగృతి వార పత్రిక ఎడిటర్ గోపరాజు నారాయణ రావు, అప్పాల ప్రసాద్, ఎమెస్కో పబ్లిషర్ వశిశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శనగకు పచ్చపురుగుల బెడద



మద్నూర్(జుక్కల్): మండలంలో సాగు చేసిన శనగ పంటకు పచ్చ పురుగు బెడద పట్టుకుంది. రైతులు శనగ పంటను కాపాడుకోవాలనే ఉద్దేశంతో మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రబీలో శనగ పంట ప్రధాన పంటగా పండిస్తారు. గత ఖరీఫ్‌లో పంటలు చేతికందకపోవడంతో రైతులందరు శనగ పంటపై ఆశలు పెంచుకున్నారు. అయితే పంటకు తీవ్రంగా పచ్చ పురుగు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొలువుల్లోకి కొత్త కానిస్టేబుళ్లు

- జిల్లాలో శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు 217 మంది
- 32 పీఎస్‌లకు సిబ్బంది కేటాయింపు!
- 30న జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్‌లోని 32 పోలీస్‌స్టేషన్లకు కొత్త కానిస్టేబుళ్లు కొలువుదీరబోతున్నారు. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఐటీ అండ్ కమ్యూనికేషన్స్‌లో విధులు నిర్వహించనున్నారు. దీంతో జిల్లా పోలీస్‌శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత తీరనుంది. కానిస్టేబుల్ పోస్టుల కేటాయింపుతో ఆయా పోలీస్‌స్టేషన్లలో ఖాళీలు కూడా భర్తీ కానున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుళ్లకు నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో ప్రిలిమరీ పరీక్షలు నిర్వహించిన తర్వాత ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి 2023ఏప్రిల్30న కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నిర్వహించగా అక్టోబర్ 4న ఫలితాలు ప్రకటించారు. సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్ల శిక్షణను 2024ఫ్రిబవరి20న ప్రారంభించారు. నవంబర్ 21న శిక్షణ పూర్తి చేసుకున్న పోలీస్ కానిస్టేబుళ్లకు పోలీస్ అవుట్ పాసింగ్(పీవోపీ) చేపట్టారు. దీంతో జిల్లాకు కొత్త పోలీస్ కానిస్టేబుళ్లు విధుల్లోకి చేరబోతున్నారు. పీఎస్‌లలో కానిస్టేబుళ్ల కొరతతో లా అండ్ ఆర్డర్‌లో సిబ్బంది ఇబ్బందులు ఉండేవి. కొత్త కానిస్టేబుళ్లు రానున్నండడంతో కొంత ఉపశమనం కలగనుంది.

పీఎస్‌ల వారీగా కేటాయింపులు

జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్, కేసుల సంఖ్య వరంగా సిబ్బందిని కేటాయించే అవకాశాలు ఉన్నాయి. కమిషనరేట్ పరిధిలో 264 మంది కానిస్టేబుళ్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 217 మంది పురుష, మహిళా కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేశారు. మిగతా 47 మంది సెలక్షన్ తర్వాత వివిధ కారణాలతో శిక్షణ పూర్తి చేసుకోలేదు. దీంతో ఈ పోస్టులు మిగిలిపోయాయి. ఒక్కో పీఎస్ కు 4 నుంచి 7గురు కానిస్టేబుళ్లను కేటాయించే అవకాశాలు ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్‌లో ఉన్న ఆరు పీఎస్‌లు, ఒక మహిళా పోలీస్‌స్టేషన్‌తోపాటు మంత్రులు,రాజకీయపార్టీల ముఖ్య నాయకులు, వీవీఐపీలు, వీఐపీలు, కేంద్ర, రాష్ట్రలకు సంబంధించిన ఉన్నతాధికారులు ఎక్కువగా ఉండటంతో ఈ స్టేషన్ల కు సిబ్బందిని ఎక్కువగా కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల గ్రూప్–4 ఫలితాల్లో శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు ఉద్యోగాలు వచ్చాయి.దీంతో వారు గ్రూప్–4 ఉద్యోగానికి వెళ్లనున్నట్లు తెలిసింది.

అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో..

శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు ఈ నెల 30న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో హాజరు కావాల్సి ఉంటుంది.

ఈ నెల 21న పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వారికి కావాల్సిన వివరాలను వెల్లడించి, వివిధ రకాల ఫారాలు అందించారు. వీరు ఇచ్చిన ఫారాలతో ఈనెల 30న హాజరు కావాల్సి ఉంటుంది. సీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన వారికి కొత్తగా విధులు కేటాయించనున్నారు.

ఏఆర్ కానిస్టేబుళ్లు..

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుళ్లు ఈనెల 30న భర్తీ కానున్నారు. బందోబస్తు, రాస్తారోకోలు, మంత్రులు, వీఐపీలు, వివిధ ఘటనలకు ఏఆర్ పోలీసులు బందోబస్తు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 132 మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా 126 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నుంచి నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ ప్రాంతాలకు ఆర్మ్‌డ్ పోలీసులను కేటాయించనున్నారు.

సాక్షి 'స్పెల్‌బీ'కి విశేష స్పందన



స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సాక్షి మీడియా కృషి చేస్తోంది.

SAKSHI SPELL Bee 2024-25

డ్యూక్స్ వ్యాఫీ, ట్రిప్స్ ఇంటర్నేషనల్(రాజమండ్రి)స్కూల్ వారు అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పోటీలను సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించారు. పోటీలకు విశేష స్పందన లభించింది. స్పెల్‌బీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారు.

SAKSHI MATH BEE 2024-25

మ్యాథ్స్ బీ పరీక్షలతో గణితంలో మెలకువలను నేర్చుకున్నారు. వివిధ దేశాల్లో ఇలాంటి పోటీ పరీక్షలు జరుగుతున్నాయి. వీటి ముఖ్య ఉద్దేశం విద్యార్థిని పరిపూర్ణవంతుడిగా తీర్చిదిద్దడమే. అందులో భాగంగా 'సాక్షి' కూడా విద్యార్థుల్లో ఆంగ్ల పద సామర్థ్యాన్ని, గణిత పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఏటా ఈ పోటీలు నిర్వహిస్తుండటంతో మేధావులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో పలువురు సీఐలు శనివారం రాత్రి బదిలీ అయ్యారు. ట్రాఫిక్ సీఐగా ఉన్న వీరయ్యను పీసీఆర్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో డీసీఆర్‌బీలో పని చేస్తున్న సీఐ పబ్బ ప్రసాద్ బదిలీపై వచ్చారు. నార్త్ సీఐ నుంచి డీఐజీ ఆఫీస్‌కు అటాచ్ అయిన సతీశ్‌కుమార్ నిజామాబాద్ సీసీఆర్‌బీకి వచ్చారు.

'భావ ప్రకటన స్వేచ్ఛకు రక్షణ కరువు'



మాట్లాడుతున్న గొర్రెపాటి మాధవరావు

బోధన్: నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ప్రాథమిక హక్కులు అపహాస్యం పాలవుతున్నాయని మానవ హక్కుల వేదిక(హెచ్‌ఆర్‌ఎఫ్– హ్యూమన్ రైట్స్ ఫోరం) రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక హక్కులుగా గుర్తించబడిన జీవించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛకు రక్షణ కరువైందన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో నిర్వహించిన మావన హక్కుల వేదిక జిల్లా 7వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. సామాజిక, ఆర్థిక అసమానత, అణిచివేత, వివక్షత నెలకొన్న పరిస్థితుల్లో అణగారిన వర్గాల ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతోందన్నారు. రాజ్యాంగ లక్ష్యాలు సాధించే కర్తవ్యాన్ని పాలకులు నెరవేర్చాలన్నారు. హక్కుల రక్షణ ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. సభలో కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల అధ్యక్షులు సల్వాల రమేశ్, గడ్డం గంగులు, ప్రతినిధులు పిట్ల సరిత, అహ్మద్, అరుణ రేఖా, మీనా సహానీ, మారుతి, అరుణ్, నరేందర్, న్యాయవాదులు వి సంగం, రమేశ్, శ్రీనివాస్, అన్వేశ్, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

'లోక్‌మంథన్'లో కోలాట బృందం



నిర్వాహకులతో భక్త మార్కండేయ కోలాట బృంద సభ్యులు



లోక్‌మంథన్‌లో ప్రదర్శన ఇస్తున్న బాడ్సి కోలాట బృందం

మోపాల్: హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న భారతదేశ అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవం లోక్‌మంథన్ భాగ్యనగర్–2024లో మండలంలోని బాడ్సి నుంచి వెళ్లిన సుమారు 50 మంది భక్త మార్కండేయ కోలాట బృందం తన ప్రదర్శన ఇచ్చింది. గురువు మహిపాల్‌రెడ్డి, సహ గురువు దశరథ్ ఆధ్వర్యంలో బృందం కోలాటం ఆటను అద్భుతంగా ప్రదర్శించింది. లోక్‌మంథన్ కార్యక్రమంలో 12 దేశాల ప్రతినిధులు, 100 మంది వక్తలు, 350 ప్రదర్శనలు, 1500 మంది కళాకారుల మధ్య భక్త మార్కండేయ బృందం కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుందని, ఈ బృందాన్ని నిర్వాహకులు అభినందించారని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కోలాటం సభ్యులు ఈరమ్మ జగదీశ్‌రెడ్డి, రవి, బక్కిలి మోహన్, గౌడుగు గోపాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల అపూర్వ సమ్మేళనం



ఒకే వేదికపై కలిసిన వస్తాద్ పూర్వ క్రీడాకారులు

పెర్కిట్: వస్తాద్ క్లబ్.. ఆ పేరు వింటేనే జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులకు, క్రీడాభిమానులకు ఆటల్లో క్లబ్ సాధించిన విజయాలు, క్రీడా పోటీలు గుర్తుకు వస్తాయి. సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం ఆర్మూర్ క్రీడాకారులతో స్థాపించిన వస్తాద్ క్లబ్ క్రీడా స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా అందరికి సుపరిచితమైంది. జిల్లాలో హాకీ క్రీడకు ఆర్మూర్ పుట్టినిల్లుగ ప్రఖ్యాతి గాంచడంలో వస్తాద్ క్లబ్ క్రీడాకారులనడంలో అతిశయోక్తి లేదు. మూడు దశాబ్దాల క్రితమే వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొని చాంపియన్లుగా నిలిచారు. అలాగే ఎలాంటి శిక్షణ లేకుండా క్రికెట్‌లో లీగ్ పోటీలు ఆడిన ఘనత వస్తాద్ క్లబ్ క్రీడాకారులది. క్లబ్‌కు సంబంధించిన క్రీడాకారులు క్రీడా కోటలో, పోలీస్ శాఖలో, విద్యా శాఖలో ఉద్యోగాలు చేస్తుండగా మరి కొందరు క్రియాశీల రాజకీయాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. కార్యక్రమంలో చెరుకు పృథ్వీరాజ్, ఎం వెంకట్రామ్ రెడ్డి, కె రాజేందర్‌రెడ్డి, జీవీ నర్సింహరెడ్డి, బి విజయ్ కుమార్, అంబల్ల తిరుపతి, యగ్నేశ్, హర్షవర్ధన్ రెడ్డి, వస్తాద్ వెంకటేశ్, అంబల్ల తిరుపతి, వేణుగోపాల్ రెడ్డి, రఫీ గోహార్, విష్ణు, కంచెట్టి గంగాధర్, కొంతం మురళి, మగ్బుల్, ఖదీర్, ఇంతియాజ్ అలీ, అశ్విన్ రెడ్డి, ప్రీతం, గణేశ్ రెడ్డి, గోపి రెడ్డి, అజ్జు, జిమ్మి రవి, రమాకాంత్, ఇట్టం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై కలపాలని..

దుబాయిలో స్థిరపడ్డ ఆర్మూర్ పట్టణానికి చెందిన జయరాజ్ బాబి అలాగే హైదరాబాద్‌లో స్థిరపడ్డ అమరనాథ్ సారథ్యంలో 'వస్తాద్ రీ యూనియన్' పేరుతో ఎక్కడెక్కడో స్థిరపడ్డ సభ్యులతో ఆదివారం అంకాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మొదట స్వర్గస్తులైన ఏడుగురు క్లబ్ సభ్యుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం సభ్యులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

వస్తాద్ వల్లే ఉన్నత స్థాయికి ఎదిగాను



వస్తాద్ క్లబ్ సభ్యుల ప్రోత్సాహంతోనే నేను ఉన్నత స్థాయికి ఎదిగాను. కులమతాలకతీతంగా సభ్యులందరం కలిసి ఉంటాం. సుదీర్ఘకాలం తర్వాత అందరం ఒకే చోట కలవడం జీవితంలో మరిచిపోలేనిది.

– బి అమర్‌నాథ్, హైదరాబాద్, వస్తాద్ క్లబ్ సూపర్ సీనియర్ క్రీడాకారుడు

ఒకే చోట కలపాలని..



నాలుగున్నర దశాబ్దాల క్రితం స్థాపించిన వస్తాద్ క్లబ్ క్రీడాకారులను ఒకే చోట కలపాలనే సంకల్పంతో సమ్మేళనం చేపట్టడం ఆనందంగా ఉంది. క్లబ్ సభ్యులందరిలో ఇప్పటికి అదే స్ఫూర్తి కొనసాగడం అద్భుతమైన విషయం.

– జయరాజ్ బాబి, దుబాయి,వస్తాద్ క్లబ్ సూపర్ సీనియర్ క్రీడాకారుడు

దుబాయిలో సుద్దపల్లివాసి మృతి



హరీశ్(ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన మేకల హరీశ్(40) గుండెపోటుతో దుబాయిలో మృతిచెందాడు. జీవనోపాధి కోసం 15 ఏళ్లగా బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం ఛాతిలో నొప్పివస్తుందని తన స్నేహితులకుచెప్పగా, వారు వెంటనే హరీశ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న సిరికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం



డిచ్‌పల్లి: ధర్మారం(బి) ఉన్నత పాఠశాలలో..

సిరికొండ/ డిచ్‌పల్లి/ నందిపేట్/ రుద్రూర్: జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. సిరికొండ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06, డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామ ఉన్నత పాఠశాలలో 2007–08, నందిపేట్ మండలం ఆంధ్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో 2005–06, రుద్రూర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి మిత్రులు అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.



ఆంధ్రనగర్ పాఠశాలలో..




రుద్రూర్‌లో..

దీపంతో వ్యాపించిన మంటలు



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో ఇంట్లో దేవుని ఫొటోల వద్ద పెట్టిన దీపంతో ఇంటి పై కప్పు వరకు మంటలు వ్యాపించిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన లక్ష్మి ఇంట్లో శనివారం ఉదయం దేవుని ఫొటోల వద్ద దీపారాధనలో భాగంగా దీపం వెలిగిచింది. ఆ దీపం రాత్రి వరకు అలాగే ఉంది. దీపం నుంచి వచ్చిన మంటలు దూలం కర్రలకు అంటుకోవడంతో ఇంట్లో మంటలు వ్యాపించాయి. నిద్రలో ఉన్న లక్ష్మి, కుమారుడు కిరణ్ వెంటనే మేల్కొని కేకలు వేయడంతో స్థానికులు మేల్కొని ఇంటి వద్దకు చేరుకున్నారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో మంటలను ఆర్పి వేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ.. పలువురికి గాయాలు



సదాశివనగర్: ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటన మండలంలోని భూంపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ నుంచి కామారెడ్డికి వస్తున్న ఆర్టీసీ బస్సు, కామారెడ్డి నుంచి బిచ్కుంద వైపునకు వెళ్తున్న కారు ఢీకొన్నది. ఈ ఘటనలో బిచ్కుంద మండలం బండరెంజల్ గ్రామానికి చెందిన రాంరెడ్డి, రాణిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్



చాంపియన్‌గా నిలిచిన బాలుర జట్టు

నిజామాబాద్‌నాగారం: మెదక్ జిల్లా మాసాయిపేట్‌లో ఈనెల 23 నుంచి 24 వరకు నిర్వహించిన రాష్ట్ర సబ్–జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జిల్లా బాలుర జట్టు ఫైనల్ మ్యాచ్‌లో మెదక్ జట్టుపై తలపడి 7–1 తేడాతో విజయం సాధించి టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో అధికారులు విజేత జట్టుకు ట్రోఫీ, బంగారు పతకం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడంపై జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, బొజ్జ మల్లేశ్‌గౌడ్, ఎం మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్, పి నీరజ రెడ్డి, సంగీతరావు, పవన్ కుమార్, రాజ్ కుమార్,రాజేందర్, టి సునీత, మర్కంటి సుజాత, చిప్ప నవీన్, సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా ఈ నరేశ్, సాయికుమార్, తిరుపతి వ్యవహరించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



బినయ్‌కుమార్ ఠాకూర్ మృతదేహం

వేల్పూర్: మండలంలోని లక్కోర వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ బినయ్‌కుమార్ ఠాకూర్(29) ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బినయ్‌కుమార్ ఠాకూర్ పదిరోజుల క్రితం మోర్తాడ్ మండలం దొన్కల్‌కు వచ్చి స్థానికంగా ఉండే విజయ్ దగ్గర లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వెల్కటూర్‌లో వడ్లు లోడ్ చేసుకొని నిజామాబాద్‌లో దింపి వస్తుండగా లక్కోర వద్ద డ్యామేజ్ అయిన కల్వర్టును ఢీకొన్నట్లు పేర్కొన్నారు. ఎడమవైపు లారీ ఢీకొనగా కుడివైపునకు తిప్పే క్రమంలో లారీ అదుపుతప్పి పొలాలకు దూసుకెళ్లిందన్నారు. ఈ క్రమంలో లారీ నుంచి దూకి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నంలో వెనుక టైర్ల కింద పడిపోయాడు. అదే లారీ వెనుక బొలేరో వాహనంలో వస్తున్న అతని స్నేహితుడు లలిత్‌ఠాకూర్ ప్రమాదాన్ని గుర్తించి స్థానికుల సాయంతో బినయ్‌కుమార్ ఠాకూర్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. స్నేహితుడు లలిత్‌ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బర్రెను ఢీకొన్న ఘటనలో మరొకరు..

పిట్లం: మండల శివారులో జాతీయ రహదారిపై బర్రెను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పిట్లం శివారులో శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి వస్తున్న ఓ కారు బర్రెను ఢీకొన్నది. ఇందులో కారులో ఉన్న మారుతిరావు(80) తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న మారుతిరావు కుమారుడు సతీశ్, మృతుడి భార్య ఇరి బాయికి తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి పెద్దకుమారుడు మాధవ్ ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..



చిన్నుబాయి మృతదేహం

నవీపేట: ఆలయంలో దీపం వెలిగిస్తూ ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని తీవ్రగాయాలైన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నవీపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది.

ఎస్సై వినయ్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీకి చెందిన జడల చిన్నుబాయి(70) అనే వృద్ధురాలు ఈ నెల 11న స్థానిక లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో దీపం వెలిగిస్తుండగా చీరకు నిప్పంటుకుంది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSION
■ Admission for guidence ఇంటర్, డిగ్రీ, పీజీ, B.Tech, LLB, B.Sc, అగ్రి, GNM, BHMS, BAMS, BNYS, BPT, D.ఫా, B.ఫా. 9494903629, 7660043034 కొన్ని సీట్లు మాత్రమే. [Z-1239947]

WANTED
■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K. Ph: 9160900024, 9640400073. [SCA24000672]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.